సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



డ్రైవర్ నిర్లక్ష్యం..

ఓ డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యానికి ఎంప్లాస్టిక్ టవర్ దెబ్బతిని ట్రాన్స్‌కో సంస్థకు రూ.3.5లక్షల నష్టం వాటిల్లింది. 8లో▸



జీపును ఢీకొట్టిన కారు

కార్మికులతో ప్రయాణిస్తున్న జీపును ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో పలువురు గాయపడ్డారు. 8లో▸



వేడుకల నేపథ్యంలో..

న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో ఎక్సైజ్ పోలీసుల నేతృత్వంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. 8లో▸

న్యూస్‌రీల్

కేజీబీవీని తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ సుశీందర్ రావు

మాడ్గుల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను శనివారం జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రిజిస్టర్లు, వంటగది, ఆహార పదార్థాలు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. డీఈఓ వెంట ఏంఈఓ సర్దార్ నాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా చూడాలి



శిక్షణలో పాల్గొన్న వలంటీర్లు

హుడాకాంప్లెక్స్: యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా మాస్టర్ వలంటీర్లు కృషి చేయాలని ఎస్ఎల్ఏపీ (స్టేట్ లెవల్ కో ఆర్డినేటింగ్ ఏజెన్సీ) డైరెక్టర్ కోమలి అన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో ఉన్న మహిళా సాధికార కేంద్రంలో శనివారం నషాముక్త్ భారత్ అభియాన్ మాస్టర్ వలంటీర్లకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మద్యానికి బానిసైన వారిని అడిక్షన్ సెంటర్లలో చేర్పించి వ్యసనం నుంచి బయటపడేలా చేయాలని సూచించారు. అనంతరం మాస్టర్ వలంటీర్ల పాత్ర, ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సీహెచ్ సంధ్యారాణి, ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీశైలం, సైకాలజిస్ట్ శ్రీనివాస్, శిక్షకుడు శ్రీశైలం పాల్గొన్నారు.

లంబాడీల సభను జయప్రదం చేయండి



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందిస్తున్న రాంబాల్ నాయక్

కేశంపేట: షాద్‌నగర్‌లో ఆదివారం నిర్వహించే లంబాడీల సభను విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ (లంబాడీ హక్కుల పోరాట సమితి) రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని గుట్టలగడ్డతండాలో శనివారం సంఘం మండల అధ్యక్షుడు రాజు నాయక్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాంబాల్‌నాయక్ మాట్లాడుతూ.. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. లంబాడీలు ఐక్యంగా ఉండి డిమాండ్లను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గుట్టలగడ్డతండా నూతన కమిటీని ఎన్నుకున్నారు.

సమాజంలో వైద్యరంగం కీలకపాత్ర: గవర్నర్



డాక్టర్ మహేందర్‌రెడ్డికి అవార్డును అందిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

రాయదుర్గం: వైద్య రంగానికి, డాక్టర్లకు సమాజంలో కీలక పాత్ర ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఐఎంఏ హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ స్థాయి సదస్సు నిర్వహించగా..ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడారు. ప్రస్తుతం వైద్య రంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, అత్యాధునిక వైద్య సేవలు రోగులకు అందించేందుకు అవకాశం ఏర్పడుతోందన్నారు. వైద్య రంగంలో మంచి సేవలను అందించే వారికి సముచిత గౌరవం లభిస్తుందన్నారు. అందుకు డాక్టర్ పి. మహేందర్‌రెడ్డి చక్కటి ఉదాహరణ అని పేర్కొన్నారు. డాక్టర్‌గా ఆయన వృత్తికి చేసిన సేవలను కొనియాడారు. అంతకు ముందు ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పి.మహేందర్‌రెడ్డికి గవర్నర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందించారు. కార్యక్రమంలో ఏఐజీ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి, ఐఎంఏ జాతీయ, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు.



మూసీ.. ఫ్యూచర్

మూసీనది పునరుజ్జీవానికి బీజం

- ఫ్యూచర్‌సిటీ వైపు అడుగులు
- ఈ రెండింటిపైనే ఆధారపడ్డ అభివృద్ధి
- వీటిపైనే ఆయా రంగాల భవిష్యత్
- కొత్త సంవత్సరంలో ముమ్మరం కానున్న పనులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఫ్యూచర్‌సిటీ, మూసీ పునరుద్ధరణపైనే ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. ఇటు సర్కార్‌తో పాటు అటు రియాలిటీ, ఇతర రంగాల భవితవ్యం సైతం ఈ కీలక ప్రాజెక్టులపైనే ఆధారపడి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం, వరుస ఎన్నికలు, హైడ్రా చర్యలతో ఏడాదంతా నష్టాలనే చవిచూసిన ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కొత్త సంవత్సరంపై బోలెడు ఆశలు పెట్టుకున్నాయి. ఫార్మాసిటీ రద్దు ప్రకటనతో జిల్లాలో పడిపోయిన భూముల ధరలు, నిలిచిన క్రయవిక్రయాలు.. ఫ్యూచర్‌సిటీ ఆవిష్కరణతో మళ్లీ ఊపందుకోనున్నాయి.

కొత్త ఏడాదిలో కొంగొత్తగా..

మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్‌సిటీ/ నెట్‌జీరోసిటీ/ఫోర్త్‌సిటీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం సేకరించిన భూమికి అదనంగా మరో 15 వేల ఎకరాలు సేకరించి, మొత్తం 30 వేల ఎకరాల్లో న్యూయార్క్ తరహా సరికొత్త మహానగరాన్ని ఆవిష్కరించాలని నిర్ణయించింది. ఇప్పటికే స్కిల్ వర్సిటీకి శంకుస్థాపన చేసింది. మెఘా సంస్థ సామాజిక బాధ్యతగా రూ.200 కోట్లతో ఈ భవనాల నిర్మాణానికి ముందుకొచ్చి ఇటీవల భూమిపూజ కూడా చేసింది. కొత్త ఏడాదిలో పనులను ముమ్మరం చేసే అవకాశం ఉంది. అంతేకాదు ఇటు నాగోలు నుంచి ఎల్బీనగర్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు, అటు ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు మెట్రోను విస్తరించనుంది. ఎయిర్‌పోర్ట్ నుంచి ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 మీదుగా మీర్‌ఖాన్‌పేట వరకు కొత్తగా ఏర్పాటు చేయనున్న ఎలివేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ (మూడు మండలాలు, తొమ్మిది గ్రామాలు, 449.27 ఎకరాలు, 330 ఫీట్లు, ఎనిమిది లేన్లు) వెంట ఈ మెట్రో కారిడార్‌ను విస్తరింపజేయనుంది. ఇప్పటికే భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు రోడ్డుకు మార్కింగ్ కూడా చేసింది. నూతన సంవత్సరంలో ఈ ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టే అవకాశం లేకపోలేదు. అంతే కాదు ఈ గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డుకు రెండు వైపులా హెచ్ఎండీఏ ద్వారా ల్యాండ్ పూలింగ్ చేసి, 40:60 ప్రాతిపదికన ఒకే తరహా విల్లాలను నిర్మించే ప్రతిపాదన కూడా కొత్త ఏడాదిలోనే తెరపైకి తీసుకొచ్చే అవకాశం ఉంది.

మూసీ పునరుజ్జీవంతో మారనున్న రూపురేఖలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో ప్రాజెక్టు మూసీ పునరుద్ధరణ కూడా జిల్లాలోనే ఉంది. వికారాబాద్ జిల్లాలో పుట్టిన మూసీ ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ను దాటుకుని నాగోలు మీదుగా భూదాన్ పోచంపల్లికి చేరుతుంది. జిల్లా భూభాగం నుంచే మెజార్టీ నది ప్రవహిస్తుంది. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో గలగల పారిన మూసీ..ప్రస్తుతం మురికి కూపంగా మారింది. నదికి రెండు వైపులా ఆక్రమణలు కొనసాగాయి. ఒకప్పుడు విశాలంగా విస్తరించి ఉన్న ఈ నది నేడు చాలా చోట్ల కుంచించుకుపోయింది. నదికి రెండు వైపులా అనేక అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ప్రభుత్వం ఈ ఆక్రమణలను గుర్తించి, ఇప్పటికే కొన్నింటిని తొలగించిన విషయం తెలిసిందే. మూసీ పునరుద్ధరణకు సైతం కొత్త ఏడాదిలోనే తొలి అడుగు పడనుంది. నదికి రెండు వైపులా విశాలమైన మాల్స్ ఏర్పాటు చేసి, వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే సంవత్సరంలో ఈ ప్రాజెక్టు పట్టాలపైకి వచ్చే అవకాశం ఉంది. ఫోర్త్‌సిటీ ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చిపెట్టనుండగా, మూసీ పునరుద్ధరణ నగరాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దనుంది.



ఊరు మాయం.. పేరు పదిలం!

సండే స్పెషల్

కొడంగల్ మండలం టేకుల్‌కోడ్ పంచాయతీకి అనుబంధంగా ఉండేది గండ్లపల్లి గ్రామం. చుట్టూ ఆహ్లాదకరమైన అటవీ ప్రాంతం. రాళ్ల గనులు, పచ్చని పంట పొలాలతో కళకళలాడేది. నాపరాతి గనులు అధికంగా ఉండటంతో ఈ ఊరిని 'గనులపల్లి' అని పిలిచేవారు. వ్యవసాయ పనులు లేని సమయంలో.. ఇక్కడి ప్రజలు గనుల్లోని రాళ్లను తవ్వి జీవనం సాగించేవారు. గనులపల్లి కాలక్రమేణా గండ్లపల్లిగా మారింది. సీన్ కట్ చేస్తే.. రెండు వందల ఏళ్ల క్రితం ఈ ఊరిని మహమ్మారి (అంటువ్యాధి) ఆవరించింది. అంతుచిక్కని గత్తర (రోగం) ప్రాణాలను కబళించసాగింది. బతుకు జీవుడా అంటూ ప్రజలంతా వలస వెళ్లడంతో గ్రామం పూర్తిగా కనుమరుగైనా రికార్డుల్లో పేరు ఇప్పటికీ కొనసాగుతోంది. – కొడంగల్

వివరాలు 8లో▸

కాలగర్భంలో కలిసిన గండ్లపల్లి

- గత్తరతో గ్రామం ఖాళీ
- రెండు శతాబ్దాల క్రితం కనుమరుగు
- పక్క ఊళ్లకు వెళ్లి అక్కడే స్థిరపడిన స్థానికులు
- క్షేత్రస్థాయిలో ఊరు లేకపోయినా.. అదే పేరుతో రెవెన్యూ రికార్డులు
- చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్న శిథిలాలు

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తోల్‌కట్ట సమీపంలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల (వికారాబాద్ జిల్లా)లో ఖాళీగా ఉన్న డీఎల్ కంప్యూటర్ సైన్స్, తెలుగు సబ్జెక్ట్‌లకు సంబంధించి పార్ట్‌టైమ్ ప్రాతిపదికన ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ తెలిపారు. ఈ నెల 30న నిర్వహించే డెమో తరగతులకు సంబంధిత సర్టిఫికెట్లతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, బయోడేటా, పూర్తి వివరాలతో రావాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

సమన్వయంతో ముందుకు సాగాలి

- పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాలి
- రాష్ట్ర విద్యా శాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

మంచాల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి విషయంలో జవాబుదారీ తనంతో ముందుకు పోవాలని రాష్ట్ర విద్యా శాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. మండలంలోని ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన సమన్వయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లల బంగారు భవిష్యత్ కోసం ముందు చూపుతో సాగాలని సూచించారు. ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని కాకుండా మనకు మనంగానే ముందుకు నడవాలన్నారు. అప్పుడే మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. ఈ పాఠశాల మాది, మా పిల్లల కోసం పని చేస్తామనే పట్టుదల ఉండాలన్నారు. పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం 15 మందితో ఆరుట్ల పాఠశాల అభివృద్ధి కమిటీని, వారికి తోడ్పాటు అందించడానికి మరో 8 మందితో సలహాదారుల కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ అధ్యాపకురాలు పద్మజ, సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ అధ్యాపకుడు లక్ష్మణ్, సోషల్ డెమొక్రటిక్ ఫోరం సభ్యుడు, ఎంఈఓ రాందాస్, ప్రధానోపాధ్యాయుడు గిరిధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహావిష్కరణ

మీర్‌పేట: ప్రపంచానికి తత్వబోధ చేయడంతో పాటు కాలజ్ఞానాన్ని బోధించిన మహాయోగి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. చందన చెరువు కట్టపై ఏర్పాటు చేసిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహాన్ని శనివారం శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రపంచంలో ఏ వింత జరిగినా వీరబ్రహ్మేంద్ర స్వామి తన కాలజ్ఞానంలో ఆనాడే చెప్పారని ప్రజలు గుర్తుచేసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మంగారి మఠం వంశ 8వ వారసుడు వీరభద్రస్వామి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, తల్లోజు ఆచారి, విగ్రహ కమిటీ చైర్మన్ అశోక్ చారి, వైస్ చైర్మన్ దయానంద్, అధ్యక్షుడు భిక్షపతి చారి, ప్రధాన కార్యదర్శి కృష్ణమాచారి, కోశాధికారి శ్రీనివాస్‌చారి, మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి పాల్గొన్నారు.



చందన చెరువు కట్టపై వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహాన్ని ఆవిష్కరించిన సబితారెడ్డి తదితరులు

తొందరపడి ప్లాట్లు అమ్ముకోవద్దు

కందుకూరు: గత ప్రభుత్వం ముందు చూపుతో ఫార్మాలో భూములు కోల్పోయిన రైతుల కోసం ఏర్పాటు చేసిన వెంచర్‌లో రైతులు తొందరపడి ప్లాట్లు అమ్ముకోవద్దని ఎమ్మెల్యే సబితారెడ్డి కోరారు. మండలంలోని బేగరికంచె సమీపంలో టీజీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వెంచర్‌ను శనివారం ఆమె సందర్శించారు. పనులు ఎలా జరుగుతున్నాయో ఆరా తీశారు. రైతుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ భూములు కోల్పోయిన కుటుంబాలు రోడ్డున పడొద్దనే ఉద్దేశంతో ఎకరాకు అదనంగా గుంట చొప్పున ప్లాటును కేటాయించారని గుర్తు చేశారు. భూములు కోల్పోయిన రైతులకు సర్టిఫికెట్ పట్టాలు అందించామన్నారు. రైతులు రియల్ వ్యాపారుల భ్రమలో పడొద్దని, తొందరపడి అమ్ముకోవద్దని సూచించారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, ఇతర నాయకులు ఉన్నారు.

జమిలీకి సీపీఎం వ్యతిరేకం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం, బహిరంగసభకు హాజరైన జనం

- దేశ సంపదను అదానీ, అంబానీకి దోచిపెడుతున్న మోదీ సర్కార్
- అదానీతో రేవంత్‌రెడ్డి చీకటి ఒప్పందం
- కాంగ్రెస్ ఏడాది పాలనలో చేసిందేమీ లేదు
- పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఇబ్రహీంపట్నం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్న జమిలీ ఎన్నికలకు సీపీఎం వ్యతిరేకమని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఇబ్రహీంపట్నంలో శనివారం నిర్వహించిన పార్టీ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే ఎలక్షన్ వ్యయం, సమయం వృథా తగ్గుతుందని ఏవేవో కుంటిసాకులు చెబుతున్నారని విమర్శించారు. ఈ ప్రతిపాదనను పార్లమెంట్‌లో పెట్టగా పలు పార్టీలు వ్యతిరేకించడంతో ప్రత్యేక పరిశీలన కోసం స్టాండింగ్ కమిటీ ముందు పెట్టారని తెలిపారు. కేంద్రంలో బీజేపీ పీడ విరగడైందని భావించిన సమయంలో చంద్రబాబు, నితీశ్‌కుమార్ అడ్డుగా నిలిచారన్నారు. ప్రధాని మోదీ దేశసంపదను అదానీ, అంబానీలకు దోచి పెడుతున్నారని దుయ్యబట్టారు. అవినీతి సొమ్ము కలిగి ఉన్నాడని అమెరికా అదానిని దోషిగా నిలబెడితే.. మోదీ సర్కారు మాత్రం వెనకేసుకొస్తోందని మండిపడ్డారు. అదానీని వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఉద్యమం చేస్తుంటే.. అతని శిష్యుడు రేవంత్‌రెడ్డి అదానీతో సుమారు రూ.2,400 కోట్ల పెట్టుబడులకు చీకటి ఒప్పందం చేసుకున్నాడని ఆరోపించారు. ఇందులో రూ.5 వేల కోట్లు సోలార్ విద్యుత్ ఉత్పత్తి, కొనుగోళ్లకు సంబంధించినవే ఉన్నాయన్నారు.

ఏడాదిలో ఏం ఒరగబెట్టారు?

రేవంత్ సర్కార్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ఏడాది ప్రజాపాలన పూర్తి చేసుకున్నామని కాంగ్రెస్ సంబురాలు చేసుకుందని.. అసలు ప్రజలకు ఏం ఒరగబెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు బంధు ఇవ్వలేదు.. ప్రతి మహిళకు నెలకు ఇస్తామన్న రూ.2,500 ఊసేలేదు.. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వలేదని దుయ్యబట్టారు. ఆయా హామీలపై మంత్రులు ఇష్టానుసారంగా, పొంతనలేని విధంగా మాట్లాడుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయంలో ఈ ప్రాంతంలో ఫార్మాసిటీ కోసం 13 వేల ఎకరాల భూసేకరణ చేస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తిరిగి భూములను రైతులకు వాపస్ ఇచ్చేస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని మరిచిపోయాడన్నారు.

రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌ను నడిపిస్తున్నాడని తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. తాను ఇచ్చిన హామీలపై ప్రజలు దృష్టిసారించకుండా కొద్దిరోజులు హైడ్రా పేరుతో హైడ్రామా నడిపాడన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో మరో 15 వేల ఎకరాల భూసేకరణ చేపట్టి విదేశీ కంపెనీలు, సంస్థలకు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలపై మరోమారు తిరుగుబావుటా ఎగరెయ్యాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు జాన్‌వెస్లీ, డీజీ నరసింహారావు, పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, నేతలు జంగారెడ్డి, పగడాల యాదయ్య, సామేల్, మధుసూదన్‌రెడ్డి, కవిత, జగదీశ్, రాంచందర్, నర్సిరెడ్డి, జంగయ్య, జగన్, శ్రీనివాస్‌రెడ్డి, బుగ్గరాములు, మల్లేష్, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీ పేరు పెట్టాలి

కలెక్టర్ నారాయణరెడ్డికి గ్రామస్తుల విన్నపం

మొయినాబాద్: కొత్తగా ఏర్పాటు చేసే మున్సిపాలిటీకి చిలుకూరు బాలాజీ పేరు పెట్టాలని ఆ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు కలెక్టర్ నారాయణరెడ్డికి విన్నవించారు. ఈ మేరకు శనివారం ఆయనను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. కొత్త మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తున్న గ్రామాల్లో చిలుకూరు గ్రామపంచాయతీ జనాభా, ఓటర్లు, రెవెన్యూ, విస్తీర్ణంలోనూ పెద్దదన్నారు. దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన చిలుకూరు బాలాజీ పేరుతో మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర‌రెడ్డి సైతం చిలుకూరు బాలాజీ పేరును ప్రతిపాదిస్తూ ఇచ్చిన లేఖను ఈ సందర్భంగా కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పార్టీ జిల్లా నాయకుడు గున్నాల గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సహదేవ్, నాయకులు శ్రీరాములు, మహేశ్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

ముర్తుజాగూడను విలీనం చేయాలి

మొయినాబాద్ మండలం ముర్తుజాగూడ పంచాయతీని కొత్తగా ఏర్పాటు చేసే మొయినాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేయాలని ఆ గ్రామస్తులు కలెక్టర్ నారాయణరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఏడు పంచాయతీలతో ప్రతిపాదించిన మొయినాబాద్ మున్సిపాలిటీలో ముర్తుజాగూడ పంచాయతీ పేరులేదని.. మొయినాబాద్, సురంగల్, ఎనికేపల్లి, చిలుకూరు గ్రామాల మధ్యలో ఉన్న ముర్తుజాగూడ పంచాయతీని విస్మరించి మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తే భౌగోళికంగా ఇబ్బంది ఉంటుందన్నారు. కలెక్టర్‌ను కలిసినవారిలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు పాలమాకుల యాదయ్యయాదవ్, గ్రామస్తులు సామ రాజేందర్‌రెడ్డి, విజయరాజు, రవీందర్, వడ్డె రమేష్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

రాజునాయక్‌కు డాక్టరేట్



యాచారం: మండల పరిధిలోని బొలిగుట్టతండాకు చెందిన వద్యా రాజునాయక్ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఆయన చేపట్టిన సామాజిక సేవలను గుర్తించిన ఆస్య ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ శనివారం తమిళనాడులోని హోసూర్‌లో అవార్డుతో సత్కరించింది. గతంలో నందివనపర్తి సర్పంచ్‌గా పనిచేసిన రాజునాయక్ కోవిడ్ సమయంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో పేదలకు ఉచితంగా బియ్యం, వంట సరుకులు పంపిణీ చేశారు. ఆయన సతీమణి రజిత ఎంపీపీగా పనిచేశారు.

జీపును ఢీకొట్టిన కారు

పలువురికి గాయాలు

మంచాల: కార్మికులతో ప్రయాణిస్తున్న జీపును ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో పలువురు గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి మండల పరిధిలోని ఎల్లమ్మ తండా సమీపంలో చోటు చేసుకుంది. సీఐ మధు తెలిపిన ప్రకారం.. ఎల్లమ్మ తండాకు చెందిన కార్మికులు కట్టె కొట్టే పనులకు వెళ్లి రంగాపూర్ నుంచి జీపులో తిరుగుప్రయాణమయ్యారు. ఎల్లమ్మ తండా నర్సరీ సమీపంలోకి రాగానే లోయపల్లి నుంచి ఎదురుగా వస్తున్న స్విఫ్ట్ కారు జీపు వెనుక భాగంలో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంబోత్ దస్రూ నాయక్, సపావట్ లచ్చిరాం, సపావట్ బిక్కు నాయక్, సపావట్ హీరా లాల్, రత్లావత్ హీరా లాల్, కొర్ర పాండుతో పాటు కారు డ్రైవర్ కానుగుల శేఖర్ తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఊరు మాయం | పేరు పదిలం!

సండే స్పెషల్



కొడంగల్: పురాతన చరిత్ర కలిగిన గండ్లపల్లి కాలగర్భంలో కలిసిపోయింది. గిరిజన ప్రజలు నివసించే ఈ ఊరిలో సుమారు వందమందికి పైగా జనాభా ఉండేది. ప్రాణాంతక వ్యాధి సోకడంతో పదుల సంఖ్యలో స్థానికులు మృత్యువాత పడ్డారు. దీంతో భయపడిన గ్రామస్తులు కుటుంబాలుగా విడిపోయి, సమీప గ్రామాలకు వలస వెళ్లారు. అలా వెళ్లిన వారు అక్కడే స్థిరపడిపోయారు.

ఆవాసాలు నేలమట్టం

కొడంగల్‌కు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న గండ్లపల్లి ప్రస్తుతం చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. ప్రజలంతా గ్రామాన్ని వదిలి వెళ్లడంతో గుడిసెల మాదిరిగా ఉండే ఆవాసాలు నేలమట్టమయ్యాయి. గ్రానైట్, నాపరాయితో పటిష్టంగా నిర్మించిన ఆలయాలు, బురుజులు మాత్రం చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

ఆలయాలు, బురుజులు

గండ్లపల్లి శివారులోని బురుజులు నాటి గుర్తులకు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. బురుజులో ఊరడమ్మ ఆలయం ఉంది. ఇందుకు సంబంధించిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గండ్లపల్లితో పాటు సమీప గ్రామాల ప్రజలు ఇక్కడికి వచ్చి పూజలు చేసేవారని తమ పెద్దలు చెప్పినట్లు వృద్ధులు పేర్కొంటున్నారు. దీనికి సమీపంలోనే అంజనేయస్వామి ఆలయం ఉంది. పూర్తిగా శిథిలమైన ఈ ఆలయాల్లోకి వెళ్లేందుకు ఇప్పటికీ ఎవరూ సాహసించరు.

శివారు గ్రామాల్లో స్థిర నివాసం...

మహమ్మారి బారినుంచి ప్రాణాలు దక్కించుకునేందుకు ప్రజలంతా తమ పిల్లాపాపలు, పెంపుడు జంతువులను తీసుకుని పక్క గ్రామాలకు పయనమయ్యారు. శివారు గ్రామాలైన ధర్మాపూర్, టేకుల్‌కోడ్ వెళ్లి తలదాచుకున్నారు. కొన్నాళ్ల తర్వాత అక్కడే స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు.

అప్పట్లో వందకు పైగా జనాభా...

రెండు శతాబ్దాల క్రితం గండ్లపల్లిలో 115 మంది గిరిజనులు జీవించేవారు. అందులో స్త్రీలు 53 మంది, పురుషులు 62 మంది ఉండేవారు. వీరిలో 106 మంది నిరక్షరాస్యులే. 22 నివాస గృహాల్లో జీవించినవారంతా ప్రేమానురాగాలతో కలిసిమెలిసి ఉండేవారు. గ్రామ విస్తీర్ణం 1,142 హెక్టార్లుగా నమోదై ఉంది.

కొనసాగుతున్న 'వారసత్వం'

గ్రామానికి చెందిన పూర్వీకుల నుంచి తరతరాలుగా వారి వారసులకు భూములు సంక్రమిస్తున్నాయి. వందల ఏళ్లుగా పక్క గ్రామాల్లో స్థిరపడిపోయిన వీరి పొలాలు మాత్రం రెవెన్యూ రికార్డుల్లో గండ్లపల్లి పేరుతోనే కొనసాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌లో కూడా గండ్లపల్లి పేరుమీదే భూముల క్రయవిక్రయాలు కొనసాగుతున్నాయి.

సరిహద్దులివే..

గండ్లపల్లి గ్రామానికి దక్షిణాన దౌల్తాబాద్ మండలం, తూర్పున బొంరాస్‌పేట మండలం, ఉత్తరాన యాలాల మండలం, పశ్చిమాన కర్ణాటక రాష్ట్రం ఉంది.

"ధర్మాపూర్‌లో స్థిరపడ్డాం



మా తాతల కాలంలో ఊరును ఖాళీ చేశారు. అప్పట్లో విషజ్వరాలు రావడం వల్ల ఊరి జనమంతా శివారు గ్రామాలైన ధర్మాపూర్, టేకుల్‌కోడ్ వెళ్లి స్థిరపడ్డారు. మా తాత తన పిల్లలతో కలిసి ధర్మాపూర్ వచ్చేశారు. మా భూములు ఇప్పటికీ గండ్లపల్లి పేరుతోనే ఉన్నాయి. – సాయప్ప, ధర్మాపూర్

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం



అదృశ్యమైన తల్లీపిల్లలు

హయత్‌నగర్: ఇద్దరు పిల్లలతో కలిసి ఓ తల్లి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూరు గ్రామం రాజీవ్ గృహకల్ప కాలనీలో మహబూబ్ అలీఖాన్ తన భార్య సహజా బేగం కొడుకు సల్మాన్‌ఖాన్, కూతురు ఆఫ్రిన్ బేగంతో కలిసి నివసిస్తున్నాడు. ఈ నెల 22న మహబూబ్ అలీఖాన్ తన పనికోసం వెళ్లి 23న తిరిగి వచ్చే వరకు భార్యా పిల్లలు కనిపించలేదు. ఫోన్ చేసినా స్పందించలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పనికి వెళ్లిన యువతి



సంధ్య(ఫైల్)

మొయినాబాద్: పనికి వెళ్తున్నాని చెప్పి ఇంటినుంచి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. ఈ ఘటన మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన దర్గ సంధ్య(22) గండిపేట చౌరస్తా వద్ద ఉన్న ఓ కళాశాలలో జాబ్ చేస్తుంది. రోజు మాదిరిగానే శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో డ్యూటీకి వెళ్తున్నాని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పనిచేసే చోట, పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితులు వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో శనివారం మొయినాబాద్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెలూన్ నిర్వాహకుడు..



దీపక్ కుమార్ (ఫైల్)

శంకర్‌పల్లి: మోకిల పీఎస్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన దీపక్ కుమార్(23) మూడేళ్ల క్రితం మోకిలకు వచ్చాడు. తన అక్క, బావ ఇంట్లోనే ఉంటూ ఓ కటింగ్‌షాప్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం షాప్‌నకు వెళ్లిన దీపక్ సాయంత్రం తిరిగి రాలేదు. దీంతో ఆయన అక్కబావలు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం దీపక్ సోదరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు.

డ్రైవర్ నిర్లక్ష్యం.. రూ.3.5 లక్షల నష్టం

- ఐదు రోజుల క్రితం విద్యుత్ టవర్‌ను ఢీకొట్టిన డీసీఎం
- వాహనం తొలగిస్తే ప్రమాదమని చెప్పిన ట్రాన్స్‌కో అధికారులు



ఐదు రోజులుగా టవర్ వద్దే డీసీఎం.. పక్కనే కొత్త టవర్ నిర్మాణం

ఇబ్రహీంపట్నం రూరల్: ఓ డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యానికి ట్రాన్స్‌కో సంస్థకు రూ.3.5లక్షల నష్టం వాటిల్లింది. ఐదు రోజుల క్రితం ఆదిబట్ల మున్సిపాలిటీ టీసీఎస్ మార్గంలో ఓ డీసీఎం లోడ్‌తో ప్రయాణిస్తుంది. ఈ క్రమంలో రెడీమిక్స్ ప్లాంట్ వద్దకు రాగానే ఓ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడి తలకు గాయాలవ్వడంతో డ్రైవర్ వాహనం నుంచి దూకి పరారయ్యాడు. దీంతో డీసీఎం అదే వేగంతో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టంకు సరఫరా అయ్యే 33కేవీ ఎంప్లాస్టిక్ టవర్‌ను ఢీకొట్టింది. ఆ టవర్ దెబ్బతింది. డీసీఎంను తొలగిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు చెప్పడంతో నూతన స్తంభం ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. ఈ స్తంభం ఏర్పాటుకు రూ.3.5లక్షలు వెచ్చించాలి. స్తంభాన్ని మార్చిన తర్వాతే డీసీఎంను తొలగించనున్నారు. కాగా క్షతగాత్రుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో..

రైళ్లలో విస్తృత తనిఖీలు

- వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో గోవా నుంచి తరలిస్తున్న 95 మద్యం బాటిళ్లు సీజ్
- తాండూరు ప్లాట్‌ఫాంపై 12 కిలోల గంజాయి స్వాధీనం



వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ రైలులో స్వాధీనం చేసుకున్న గోవా మద్యం బాటిళ్లు

న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. వికారాబాద్, తాండూరు రైల్వే స్టేషన్‌లో అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యంతో పాటుగా.. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తాండూరులో శనివారం నిర్వహించిన సమావేశంలో ఏఈఎస్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ పురస్కరించుకుని గంజాయి, డ్రగ్స్, మద్యం అక్రమంగా తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందిందని.. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి గోవా నుంచి వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ రైలులో వికారాబాద్ వద్ద తనిఖీలు నిర్వహించగా రూ.లక్షల విలువైన 95 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయన్నారు. శనివారం మధ్యాహ్నం భువనేశ్వర్ నుంచి ముంబాయి వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు తనిఖీల్లో నిషేధిత పదార్థాలు ఏమీ లభ్యం కాలేదన్నారు. తాండూరు రైల్వే స్టేషన్‌లోని 2వ నంబర్ ప్లాట్‌ఫాం పై ఆరు బ్యాగుల్లో రూ.లక్షల విలువైన 12 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు ఎవరూ పట్టుబడలేదని.. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ శ్రీనివాస్, వికారాబాద్ ఎస్ఐ వీరాంజనేయులు సిబ్బంది పాల్గొన్నారు.

మెట్రో మార్గాల్లో 'డబుల్ డెక్కర్లు'

విప్రో సర్కిల్, ఆల్విన్ జంక్షన్ల వద్ద నిర్మాణం

- కింద ఫ్లై ఓవర్, పైన రైలుమార్గం
- ఎస్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద మరో ఫ్లై ఓవర్

సాక్షి, సిటీబ్యూరో: హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్ట్ కింద నిర్మించబోయే ఫ్లై ఓవర్ల మార్గాల్లో మెట్రోరైలు వచ్చే ప్రాంతాల్లో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ల నిర్మాణాలు జరపనున్నారు. హై సిటీ ప్రాజెక్టులో భాగంగా గ్రేటర్ నగరంలో వివిధ ప్రాంతాల్లో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, రహదారుల విస్తరణ తదితర పనులకు ప్రభుత్వం రూ.7,032 కోట్ల పనులకు పరిపాలన అనుమతులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సదరు పనులు ప్రారంభించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ ప్రాజెక్టుల్లో భాగంగా ఖాజాగూడ జంక్షన్, ఐఐఐటీ జంక్షన్, విప్రో జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్ల పనులకు రూ.837 కోట్లు పరిపాలన అనుమతులు జారీ చేశారు. వాటిల్లో విప్రో సర్కిల్ దగ్గర రెండు మార్గాల్లో నాలుగు లేన్ల ఫ్లై ఓవర్ నిర్మించనున్నారు. విప్రో గేట్ దగ్గర నుంచి ప్రారంభమయ్యే ఈ ఫ్లై ఓవర్ 'యాక్సెంచర్'కు ముందుగా దిగనుంది. ఇదే మార్గంలో మెట్రో రైలు రెండో దశలో భాగంగా రాయదుర్గం నుంచి కోకాపేట నియోపోలిస్ వెళ్లే మార్గం రానుంది. ఈ నేపథ్యంలో హై సిటీ పనులు చేస్తున్న జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం, మెట్రో అధికారులు జంక్షన్ వద్ద మెట్రోరైలు మార్గాన్ని ఫ్లై ఓవర్ పైనుంచి తీసుకెళ్లేలా ప్లాన్ చేశారు. అందుకనుగుణంగా డిజైన్లు రూపొందించనున్నారు. అలాగే ఆల్విన్ క్రాస్‌రోడ్, మియాపూర్ జంక్షన్ల మధ్య 2.28 మీటర్ల మేర ఆరులేన్ల ఫ్లై ఓవర్, లింగంపల్లి వైపు నుంచి గచ్చిబౌలి వైపు 800 మీటర్ల మేర మూడు లేన్ల అండర్‌పాస్ రానుంది. ఈ పనుల కోసం రూ.530 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి. ఇక్కడ ఫ్లై ఓవర్ మార్గంలోనే మియాపూర్ నుంచి పటాన్‌చెరు వెళ్లే మెట్రో మార్గం రానుంది. దీంతో ఇక్కడ కూడా మొదటి వరుసలో ఫ్లై ఓవర్, రెండో వరుసలో మెట్రోమార్గం నిర్మించాలనే ఆలోచనలో అధికారులున్నారు. దీనికి సంబంధించి ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నాగోల్ నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు వెళ్లే మెట్రో మార్గంలోనూ ఫ్లై ఓవర్లు వచ్చే ప్రాంతాల్లో డబుల్‌డెక్కర్‌గా నిర్మాణాలు జరపనున్నట్లు తెలుస్తోంది. ఇలా మెట్రో రెండోదశ మార్గాల్లో జీహెచ్‌ఎంసీ కొత్త ఫ్లై ఓవర్లు నిర్మించాల్సిన ప్రాంతాల్లో 'డబుల్' డెక్కర్ ఆలోచనలు చేస్తున్నారు.

ఎస్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్

నగరంలో ట్రాఫిక్ రద్దీ అత్యధికంగా ఉండే జంక్షన్లలో ఒకటైన పంజగుట్ట ఎస్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద ఒక ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ అధికారులు సిద్ధమయ్యారు. ఐటీ కారిడార్ల నుంచి జూబ్లీహిల్స్ వరకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివిధ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లతో వేగంగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు వస్తున్న వాహనాలు అక్కడి నుంచి వేగం మందగిస్తున్నాయి. ఎస్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్దకొచ్చేటప్పటికి ఇది మరింత తీవ్రమవుతోంది. దీంతో ఎస్ఎఫ్‌సీఎల్ జంక్షన్ దగ్గర ట్రాఫిక్ చిక్కుల పరిష్కారానికి చట్నీస్ దగ్గర నుంచి జలగం వెంగళ్రావు పార్కు వరకు వచ్చే ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ సిద్ధమవుతోంది. ఐటీ కారిడార్ల నుంచి బంజారాహిల్స్, మాసాబ్‌ట్యాంక్, మెహదీపట్నంల వైపు వెళ్లే వారికి ఈ ఫ్లైఓవర్ వల్ల సాఫీ ప్రయాణం సాధ్యమవుతుందని అధికారులు చెబుతున్నారు.

- మెట్రో రెండోదశలో రాయదుర్గం–కోకాపేట నియోపోలిస్ మార్గంలో బయోడైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ రోడ్, నానక్‌రామ్‌గూడ జంక్షన్, విప్రోసర్కిల్, ఫైనాన్షియల్‌డిస్ట్రిక్ట్
- మియాపూర్ –పటాన్‌చెరు మార్గంలో ఆల్విన్‌క్రాస్‌రోడ్, మదీనగూడ, చందానగర్, బీహెచ్ఈఎల్, ఇక్రిశాట్
- నాగోల్– ఎయిర్‌పోర్ట్ మార్గంలో ఎల్‌బీనగర్, కర్మన్‌ఘాట్, ఒవైసీ హాస్పిటల్, చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్, తదితర ప్రాంతాలు రానుండటం తెలిసిందే.

నకిలీ ఫోన్ పే యాప్‌తో మద్యం కొనుగోళ్లు

- రూ.65వేలకు టోకరా
- నలుగురు మైనర్లను పట్టుకున్న ఎస్ఓటీ పోలీసులు
- సైబర్ క్రైం కేసు నమోదు

చేవెళ్ల: నకిలీ ఫోన్ పే యాప్‌తో మోసం చేస్తున్న నలుగురు మైనర్లను ఎస్ఓటీ పోలీసులు పట్టుకుని చేవెళ్ల స్టేషన్‌లో అప్పగించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. శనివారం కేసు వివరాలను చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ వెల్లడించారు. నలుగురు మైనర్లు చేవెళ్లలోని దుర్గా వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసి ఫేక్ ఫోన్‌పే యాప్‌తో డబ్బులు చెల్లించినట్లు చూపారు. కౌంటర్‌లో డబ్బు తక్కువగా వస్తుందని గుర్తించిన యజమాని సీసీ కెమెరాలను పరిశీలించారు. కొందరు వ్యక్తులు కౌంటర్ బిజీగా ఉన్న సమయంలో తరచూ వస్తుండడం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఓటీ పోలీసులు వారిని పట్టుకుని చేవెళ్ల స్టేషన్‌లో అప్పగించారు. వారిపై సైబర్‌క్రైం కేసు నమోదు చేశారు. వీరు కొన్ని రోజులగా రూ.65వేల మద్యం కొనుగోళ్లు చేసినట్లు గుర్తించారు. ఈ ఫేక్‌పోన్‌పే యాప్ ఎలా వచ్చింది? ఎవరు ద్వారా తీసుకున్నారు? ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు చెప్పారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

- రెండు తులాల బంగారం, 80 తులాల వెండి ఆభరణాలు మాయం
- రూ.3లక్షల నగదు అపహరణ

శంకర్‌పల్లి: తాళం వేసిన ఇంటికి గుర్తు తెలియని దుండగులు కన్నం వేశారు. ఈ ఘటన మున్సిపల్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్ గౌడ్, బాధితులు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని ఫత్తేపూర్‌లో నివసిస్తున్న వీరయ్య శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి యాదగిరిగుట్టకు వెళ్లాడు. శనివారం మధ్యాహ్నం తాళం తెరిచి ఉండడం గమనించిన పొరుగింటి వారు వీరయ్యకు సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన కుటుంబ సభ్యులతో ఇంటికి వచ్చిన వీరయ్య ఇంట్లోని రెండు తులాల బంగారం, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.3లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెంట్రింగ్ కార్మికుడి బలవన్మరణం



మహ్మద్ వసీం (ఫైల్)

పహాడీషరీఫ్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ సెంట్రింగ్ కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన బాలాపూర్ ఠాణా పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన ప్రకారం.. వాదే సాలెహీన్ బస్తీకి చెందిన మహ్మద్ వసీం(30) సెంట్రింగ్ కార్మికుడు. ఇటీవల తాగుడుకు బానిసవ్వడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పు రేకుల పైప్‌నకు చీరతో ఉరేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

'ఇంటి నుంచి గెంటేశాడు'

ఇదే విషయమై వసీం భార్య హజీరా ఫాతిమా మాట్లాడుతూ.. మూడురోజుల క్రితం తనను ఇంటి నుంచి గెంటేస్తే పిల్లలతో కలిసి చాంద్రాయణగుట్టలో పుట్టింటికి వెళ్లానని.. శుక్రవారం అక్కడకు వచ్చి కూడా తనపై చేయి చేసుకున్నాడన్నాడు. జమాత్‌లో కలిసి సాయంత్రం విడాకులకు సంబంధించి తలాక్ చెబుతానని చెప్పి వెళ్లిపోయాడన్నారు. తాగిన మత్తులో గతంలో చేతులు కోసుకున్నాడని వెల్లడించింది. కాగా వసీం ఆత్మహత్యకు భార్య కుటుంబ సభ్యుల వేధింపులే కారణమని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. వారి వేధింపులు తమకు చెప్పుకొని బాధపడేవాడన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.